ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 19.0

ఏజెన్సీ పోలీసులపై విచారణ

» ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

ఏలూరు క్రైం, జనవరి 20 : కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పోలీసు అధికారులపై వచ్చిన ఆరోపణలపై శనివారం విచారణ ప్రారంభమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా వేలేరుపాడు మండలంలో పేకాట ఆడుతూ పట్టుబడిన పలువురు జూదరుల నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్మును కేసులో చూపించకుండా పక్కకు తప్పించడంపై 'ఏజెన్సీ పోలీసా మజాకా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. దాడి సమయంలో రూ.3.80 లక్షలు పట్టుబడగా కేవలం రూ.85 వేలు మాత్రమే కేసులో చూపించడంపై వివాదాస్పదమైంది. దీనిపై కొందరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేశారు. దీనిని ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై పోలీసు అధికారులు స్పందించారు. పేకాట వ్యవహారంలో కేసు నమోదైన జూదరులను పోలవరం డీఎస్పీ ఆఫీసుకు పిలిపించారు. డీఎస్పీ రత్నరాజు ఆధ్వర్యంలో విచారణ జరిగినట్లు సమాచారం. పేకాట స్థావరంపై దాడి జరిగిన సమయంలో ఎవరెవరి దగ్గర ఎంత సొమ్ము ఉంది. పోలీసులు ఎంత చూపించారు. అనే దానిపై విచారణ జరిగింది. వేలేరుపాడుకు చెందిన పలువురు వ్యక్తులు ఇక్కడ పోలీసు అధికారులు జరిపిన అవినీతిపై పూర్తి సమాచారం ఇచ్చారు.

భీమవరానికి వందే భారత్ !

» ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్నరైలు

» అక్కడి స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సమస్యతో ఇక్కడి వరకు పొడిగించే అవకాశం.. అన్నీ అనుకూలిస్తే ఫిబ్రవరిలో పట్టాలపైకి..



నరసాపురం, జనవరి 20 : జిల్లాకు వందే భారత్ రైలు వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా మీదుగా విశాఖపట్నం - సికింద్రాబాద్ మధ్య నడుస్తోంది. అయితే ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఈ రైలుకు ఎక్కడా స్టాప్‌లు లేవు. ఇప్పుడు విజయవాడ - చెన్నైల మధ్య నడుస్తున్న వందే భారత్‌ను భీమవరం జంక్షన్ లేదా టౌన్ స్టేషన్ వరకు పొడిగించాలని రైల్వే అధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రైలు చెన్నైలో ఉదయం 5.30కి బయలుదేరి 12 గంటలకు విజయవాడ వస్తుంది. తిరిగి ఇక్కడ మధ్యాహ్నం 3.20కి బయలుదేరి రాత్రి పది గంటలకు చెన్నై వెళుతుంది. ఈ రైలు విజయవాడలో మూడు గంటలపాటు నిలుస్తోంది. దీనివల్ల ప్లాట్ ఫారాల సమస్య తలెత్తుతోంది. దీనిని నివారించేందుకు ఈ ఎక్స్‌ప్రెస్‌ను భీమవరం వరకు పొడిగిస్తే బాగుంటుందన్న యోచనలో రైల్వే అధికారులు ఉన్నారు. ఇప్పటికే జిల్లావాసులు చెన్నైకు ఎక్స్‌ప్రెస్ నడపాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం భీమవరం మీదుగా సర్కార్ నడుస్తోంది. ఇది కాకినాడ నుంచి రావడంతో జిల్లా నుంచి చెన్నై వెళ్లే వాళ్ళకు టిక్కెట్లు దొరకని పరిస్థితి. అన్ని కాకినాడ, రాజమండ్రి పై స్టేషన్లలోనే బుక్ అవుతుండడంతో ఈ రైలులో చెన్నై వెళ్లాలంటే రెండు, మూడు నెలలు అడ్వాన్స్‌గా బుక్ చేసుకోవాల్సి వస్తోంది. ఈ డిమాండ్‌ను గుర్తించిన రైల్వే అధికారులు గతంలో ప్రతి ఆదివారం నరసాపురం నుంచి చెన్నైకు ఎక్స్‌ప్రెస్ నడపాలని ప్రతిపాదించారు. అయితే ప్లాట్ ఫారాలు సాకుగా చూపి చెన్నై సెంట్రల్ రైల్వే అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఈ ప్రతిపాదన పెండింగ్‌లో పడింది. ఇప్పుడు వందే భారత్ ప్రతిపాదన తెర ముందుకు వచ్చింది. దీనికి పచ్చజెండా ఊపితే ఫిబ్రవరి లేదా మార్చిలో వందే భారత్ డెల్టా మీదుగా పరుగులు తీసే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆరంభంలో విజయవాడ నుంచి నడుస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడించారు. ఏడాదిగా పెండింగ్‌లోవున్న ఈ రైలు పట్టలెక్కడంతో కర్ణాటక వెళ్లే ప్రయాణీకులకు ఊరట లభించింది.

కాంగ్రెస్‌లో కదలిక

షర్మిల రాకతో పాత, కొత్తతరం సన్నద్ధం

ఉమ్మడి ఆంధ్ర విభజనతో అడ్రస్సు కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు జవసత్వాలు కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు ఆరంభించింది. రాష్ట్ర కాంగ్రెస్ సారథిగా షర్మిల నియామకం, ఇదే తరుణంలో పాతతరంతోపాటు ఇప్పటి వరకు వైసీపీకి అనుకూలంగావున్న కొందరు నేతలు కాంగ్రెస్ టచ్‌లోకి వస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీకి వీలుగా సంకేతాలు ఇస్తున్నారు. షర్మిల నేడు పదవీ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆమెకు మద్దతుగా ఉమ్మడి పశ్చిమ నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్తున్నారు. కాంగ్రెస్‌లో చాన్నాళ్ల తర్వాత కదలిక ఆరంభమైంది.




కనుమూరి బాపిరాజు, జెట్టి గుర్నాథరావు

» తెరముందుకు అనేక మంది సీనియర్లు.. వైసీపీ అసంతృప్తి శ్రేణులు

» ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల హామీ కోసం ఇంకొందరి యత్నాలు

» నేడు విజయవాడకు భారీగా తరలి వెళ్లనున్న నేతలు, కార్యకర్తలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కాంగ్రెస్‌లో ఒకప్పుడు యోధానుయోధులైన నేతలు ఉండేవారు. జిల్లాస్థాయిలో చక్రం తిప్పేవారు. మిగిలిన పార్టీలకు దీటుగా దూసుకుపోయేవారు. చాలామంది నేతలు పార్టీని వీడినా ఇంకా కొందరు ఈ పార్టీనే నమ్ముకున్నారు. వైఎస్ తనయ షర్మిలకు కాంగ్రెస్ పగ్గాలు ఇస్తారని ప్రతిపాదించారో అప్పటి నుంచి ఉమ్మడి పశ్చిమలో నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు ఆరంభించారు. చాన్నాళ్లపాటు కాంగ్రెస్‌లో కొనసాగి దఫదఫాల వారీగా ఎంపీగా ఎన్నికై పార్లమెంటులో ఆంధ్రా వాయిస్ వినిపించిన సీనియర్ నేత కావూరు సాంబశివరావు రాష్ట్ర విభజన అనంతరం బీజేపీలో చేరారు. ఆయన అనుకూల వర్గం దాదాపు అదేబాట పట్టింది. నియోజకవర్గాల్లో సీనియర్లు మౌనం దాల్చారు. విభజనను వ్యతిరేకించినా కాంగ్రెస్ నాయకత్వం పట్టుపట్టి మరీ విభజన చేయడంతో పార్టీని నియోజకవర్గాల్లో లేకుండా చేసేసింది. ఈ పరిస్థితుల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను మోయడానికి సైతం వెనుకడుగు వేసేవారు. రఫీవుల్లాబేగ్ చాన్నాళ్లపాటు ఉమ్మడి పశ్చిమ కాంగ్రెస్‌కు దిక్సూచిగా పనిచేశారు. ఏలూరులో పార్టీ జిల్లా కార్యాలయం శిథిలమైనా ఒకటి, రెండు గదులతోనే సరిపుచ్చుకుని మరీ పార్టీ కార్యక్రమాలు కొనసాగించారు. ఆ తదుపరి జెట్టి గురునాథరావు బాధ్యతలు స్వీకరించి కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత కదలిక తెచ్చారు. నియోజకవర్గాల వారీగా నేతలను ఏకం చేసి పార్టీకి కొంత బలం చేకూర్చే ప్రయత్నం చేశారు. ఏలూరులో కాంగ్రెస్ కొత్త భవనం నిర్మాణానికి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద పార్టీకి కొంత స్థలం కేటాయించినా భవన నిర్మాణం చేపట్టకముందే అంతా సర్దుకున్నారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పార్టీ కోసం శ్రమిస్తూ వచ్చారు. 2014 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పక్షాన ఎంపీగాను పోటీ చేశారు. అక్కడక్కడ ఉన్న పాత తరం నేతలు పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఇతరత్ర కార్యక్రమాలను మాత్రమే చేసి పార్టీ ఉనికి కాపాడేందుకు ప్రయత్నించారు.

తెలంగాణ ఫలితాల తర్వాత

తెలంగాణలో కాంగ్రెస్ విజయ ప్రభావం ఆంధ్ర కాంగ్రెస్‌పై పొడచూపింది. షర్మిలకు పార్టీ ఏపీ పగ్గాలను ఇచ్చిన తరుణంలో పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కో-ఆర్డినేటర్లను నియమించారు. నరసాపురానికి కో-ఆర్డినేటర్‌గా జెట్టి గురునాథరావు, ఏలూరుకు మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజులను నియమించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పార్టీ నేతల మధ్య సమన్వయం, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో వేగవంతమైన చర్యలు తీసుకోవడానికి ఈ నియామకాలు దోహదపడతాయని కాంగ్రెస్ భావించింది. ఈ రెండు పార్లమెంటరీ నియోజకవర్గాలకు సీనియర్లనే ఇన్‌చార్జ్‌లుగా నియమించడంపై కాంగ్రెస్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఇతర పార్టీలకు చెందిన కొందరు కాంగ్రెస్ సీనియర్లతో రాయబారాలకు దిగుతున్నారు. కాంగ్రెస్‌లోకి సాధ్యమైనంత మేర ఎవరు వచ్చినా ఆహ్వానించాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం చేస్తున్నారు. నూజివీడు బీజేపీ నేతతో పార్టీ సీనియర్లు మంతనాలు నడిపారు. దివంగత మంత్రి వసంతకుమార్ కుటుంబానికి చెందిన ఇంకొకరితో, పోలవరం కాంగ్రెస్ నేత కుమారులు ఇద్దరితోను సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ మధ్యనే వైసీపీ వ్యవహారంపై అసంతృప్తితో ఉన్న కొందరు కాంగ్రెస్‌తో ఇప్పటి నుంచే చర్చలు ఆరంభించారు. షర్మిల బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రత్యక్ష చర్చలకు దిగాలని యోచిస్తున్నారు. దెందులూరుకు చెందిన ఒక బలమైన సామాజికవర్గ నేత కాంగ్రెస్ నేతలతో టచ్‌లోకి వచ్చారు. ఈ మధ్యనే ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా రాజనాల రామ్మోహన్‌రావు ఎంపికై పార్టీ కార్యక్రమాల్లో వేగం పెంచారు. పశ్చిమ గోదావరి జిల్లాలోను వివిధ నియోజకవర్గాల్లో ఉన్న సీనియర్లు ఒక్కొక్కరిగా అటు కనుమూరి బాపిరాజుతో, ఇటు జెట్టి గురునాథరావుతో మాటామంతికి దిగుతున్నారు. 'కాంగ్రెస్‌కు మళ్లీ జీవం వచ్చినట్టే. ఇప్పుడున్న పరిణామాలు పార్టీ నిలదొక్కుకోవడానికి ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో మా పార్టీ తరపున పోటీ చేసేందుకు ఒకింత బలమైన నేతలే అందుబాటులోకి రాబోతున్నారు' అంటూ కాంగ్రెస్ నేతలంతా ధీమాతో ఉన్నారు.

విజయవాడలో పీసీసీ సారథిగా షర్మిల నేడు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు తరలి వెళ్లడానికి సిద్ధమయ్యారు. 200 కార్లు, వందలాది బైక్‌లతోపాటు ఎవరంతట వారుగానే పయనం కావడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కనుమూరి, గురునాథరావు సమన్వయం చేస్తున్నారు.



రాజీవ్‌కు పూర్వ వైభవం !

ఆచంట, జనవరి 20 : వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో నాయకుల్లో నూతనోత్సాహం వచ్చింది. జిల్లాలోని పార్టీ కార్యాలయాలు, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. ఆచంటలో కొన్నాళ్లుగా దుమ్ముపట్టి వున్న రాజీవ్ విగ్రహాన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నెక్కంటి సతీష్ ముస్తాబు చేస్తున్నారు. శనివారం నీటితో శుభ్రం చేశారు. పూర్తిస్థాయిలో రంగులు వేసి తీర్చిదిద్దనున్నారు.



పాలకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆక్వా రైతులు

ఇలాగైతే క్రాప్ హాలిడే

» సమస్యలు పరిష్కారం కాక ఆక్వా రైతుల ఆగ్రహం.. 2కే ర్యాలీ

పాలకొల్లు, జనవరి 20 : 'ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. పెరిగిన రొయ్యల మేత ధరలు, విద్యుత్ చార్జీలతో సతమతం అవుతున్నాం. ఎన్నిసార్లు తమ గోడు చెప్పుకున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదు. ఇలాగైతే త్వరలో క్రాప్ హాలిడే ప్రకటిస్తాం' అని ఆక్వా రైతులు హెచ్చరించారు. పాలకొల్లులో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు ఆధ్వర్యంలో శనివారం వేల మంది ఆక్వా రైతులు ఫ్లకార్డులతో భీమవరం బైపాస్ రోడ్డు నుంచి ఆక్వా సంఘ కార్యాలయ సభా స్థలి వరకూ 2కే ర్యాలీని నిర్వహించారు. సభలో భగవాన్‌రాజు మాట్లాడుతూ ఆక్వా రంగం నుంచి వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీడ్ కంపెనీలు, ప్రాసెసింగ్ యూనిట్లు విపరీతమైన ధరలు పెంచి రైతులను దోచుకుంటున్నాయని విమర్శించారు. మార్చి 31లో సమస్యలు పరిష్కరించకుంటే క్రాప్ హాలిడే ప్రకటించి, ఛలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజుకు వినతి పత్రం అందజేశారు. వీరికి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సంఘీభావం తెలిపారు. సంఘ కార్యదర్శి బోనం వెంకటనరసయ్య, కోడి విజయ భాస్కర్, పెన్మెత్స రామభద్రరాజు, గుంటూరి చంటిరాజు, సభ్యులు, పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



ఏలూరు జడ్పీ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల కన్నెర్ర

» 40వ రోజు నిరసనలు.. రాస్తారోకోలు.. స్తంభించి ట్రాఫిక్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 20 : రాష్ట్రంలో లక్షా 6వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు గత 40 రోజులుగా సమస్యలు పరిష్కరించమని సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఘోరమైన చర్య అని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఇతర ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం జడ్పీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బి.కె.ఎం.యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, అప్పల రాజు, కుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు పి.కిషోర్, బి.జగన్నాథం, సాయిబాబు, పీడీఎస్‌యూ నాయకుడు కాకి నాని తదితరులు పాల్గొన్నారు.



ఉదయం 11.30 ప్రాంతంలోనూ తెరుచుకోని సచివాలయం తలుపులు

తాళం పోగొట్టిన సిబ్బంది..

» మధ్యాహ్నం వరకు తెరుచుకోని మీర్జాపురం సచివాలయం తలుపులు

నూజివీడు టౌన్, జనవరి 20: మీర్జాపురం సచివాలయం తలుపులు శనివారం ఉదయం 11.30 దాటినా తెరుచుకోలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సమయపాలన పాటించాల్సిన సచివాలయ సిబ్బంది బాధ్యతారాహిత్యంతో తమ వద్ద ఉన్న సచివాలయం తాళాలను పారవేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది సైతం ఆరుబయటే కాలక్షేపం చేశారు. సచివాలయం తాళాలు తెరుచుకోని విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు మధ్యాహ్నం ఒంటిగంటకు సచివాలయ తాళాలు తెరుచుకున్నాయి.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం..

ఏలూరు, జనవరి 20: స్వయం సహాయక సంఘాల్లోని గ్రూపులతో చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం మెప్మాకు సంబంధించిన స్లమ్ లెవెల్ ఫెడరేషన్, టీఎల్ఎఫ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సంఘ సభ్యులతో యూనిట్ల స్థాపన, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలోని రెండు టీఎల్ఎఫ్ గ్రూపులు ఒక్కొక్క గ్రూపు కనీసం ఐదు చొప్పున ఉపాధి యూనిట్లు స్థాపించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఏలూరులో మహిళా మార్టు ఏర్పాటుకు తగిన ప్రాతిపాదనలతో వస్తే పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. అనంతరం ఇటీవల సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందించారు.

ఫలించిన సర్పంచ్‌ల పోరాటం

» పంచాయతీ ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం నిధుల జమ

ఏలూరు రూరల్, జనవరి 20 : నిధుల కోసం పంచాయతీల ప్రథమ పౌరుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఏలూరు జిల్లాలో 544, పశ్చిమ గోదావరిలో 409 పంచాయతీలకు మొత్తం రూ.22 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీలు ఈ నిధులతో కొంత నిలదొక్కుకునే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేంద్రం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. అయితే నాలుగున్నరేళ్లుగా రాష్ట్రప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించి సొంతానికి వాడుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పి.డి ఖాతాకు బదిలీ చేసింది. సచివాలయ నిర్వహణ ఖర్చునూ పంచాయతీలపై వేసింది. నిధుల్లేక పల్లెల్లో కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొంటున్నాయి. నిధుల లేమితో తాము పనులు చేయలేకపోతున్నామంటూ వైసీపీ ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌ల నిధుల కోసం రోడ్డెక్కారు. ఆర్థిక సంఘం నిధులు వాడుకోవడంపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌ల నిధుల ఉద్యమానికి వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. సొంత నిధులతో పనులు చేపట్టి అప్పులపాలైన పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం స్పందించడంతో పాటు సర్పంచ్‌ల ఉద్యమంతో ఉక్కిరిబిక్కిరి అయిన రాష్ట్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్టు ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది.

ఉద్యమాలతో సాధించుకున్నాం..



కేంద్రప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం పంచాయతీలకు జమ చేసింది. ఉద్యమాల ఫలితంగానే ఈ నిధులు సాధించుకున్నాం. భవిష్యత్తులో పంచాయతీలకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలి.

- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు.

డ్రైవర్ల మెడపై.. కత్తి!



హిట్ అండ్ రన్ 160.2 చట్టంపై వ్యతిరేకత

» సౌకర్యాల లేమి వల్లే ప్రమాదాలంటున్న అసోసియేషన్లు

» దుర్వినియోగానికి అత్యంత అవకాశమంటున్న న్యాయనిపుణులు

ఏలూరు-ఆంధ్రజ్యోతి :

భారతీయ న్యాయ సంహిత కింద గతేడాది ఆమోదించిన హిట్ అండ్ రన్ 160.2 చట్టంపై లారీ డ్రైవర్లు, క్లీనర్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిన్నటి వరకు పంజాబ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో ఈ చట్టంపై వ్యతిరేకతలు రాగా ఇప్పుడు మన జిల్లాలోనూ ఆందోళనలు మొదలయ్యాయి. దెందులూరు, ఏలూరు తదితర ప్రాంతాల్లోని డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్లు నిరసనలను తీవ్రతరం చేస్తున్నాయి. ఏదేని లారీ ప్రమాదం జరిగినప్పుడు ఎలా, ఏ కోణంలో జరిగిందన్న ప్రాథమిక విచారణ చేయకుండానే వాహనానికి ముందు వైపు, కుడివైపు టైరు ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందనో, కింద పడి వ్యక్తి చనిపోయాడనే విధంగా కొందరు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేసులు ఇవాళ కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. సెటిల్‌మెంట్ల కోసమో, ఆమ్యామ్యాల కోసమో ఇలాంటి కక్కుర్తి వ్యవహారాలకు వాహనదారులు లేదా డ్రైవర్లు బాధితులుగా మిగులుతున్నారు. ఆయా ప్రమాదాల్లో చనిపోయిన డ్రైవర్లు, క్లీనర్ల కంటే 70-90 శాతం అంగవైకల్యంతో ఎందుకూ పనికిరాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారే ఎక్కువ. ప్రమాదం బారిన పడ్డ వ్యక్తులకు జరగాల్సిన న్యాయం ఏదో ఒక రూపేణా జరుగుతున్న స్థితిలో ఏడాది క్రితం ఆవిష్కృతమైన హిట్ అండ్ రన్ 160.2 చట్టం డ్రైవర్ల పాలిట శాపంలా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ చట్టం వల్ల ప్రమాదాల నియంత్రణ జరగకపోగా కొందరు అవినీతి అధికారుల చేతుల్లో ఆచరణాత్మక సమస్యలకు ఆస్కారం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతం నుంచి అమలులో చట్టం..

హిట్ అండ్ రన్ చట్టం 1963 నుంచి అమలులో ఉంది. ఆ తర్వాత 80వ దశకంలో ఎమెండ్‌మెంట్ జరిగింది. ఒక వాహనం వల్ల ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులకు సమాచారం ఇవ్వకుండా డ్రైవర్లు పారిపోయిన క్రమంలో ఆ కారకులపై ఈ హిట్ అండ్ రన్ చట్టాన్ని ప్రయోగిస్తారు. గతంలో ఆ చట్టం కింద రూ.5వేల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష అమలయ్యేది. కానీ, తాజా 160.2 సవరణ చట్టం ద్వారా జరిమానా కాస్తా ప్రమాద తీవ్రతను బట్టి రూ.10 లక్షల వరకు విధించే అవకాశంతో పాటు పదేళ్ల జైలు శిక్ష అమలయ్యేలా నెల క్రితం వరకు అమలు చేశారు. దీనివల్ల డ్రైవర్లు, క్లీనర్లతో పాటు పలు వాహనాల యజమానులు సైతం ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతూ, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏలూరు జిల్లాలోనే బీమా క్లెయిమ్స్ జరక్క, ఆర్థిక నష్టాల కొద్దీ ముగ్గురు లారీ ఓనర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు నమోదైన వివరాల ప్రకారం జిల్లాకు చెందిన 213 మంది డ్రైవర్లు, క్లీనర్లు చనిపోగా, దాదాపు 400-500 మంది అంగవైకల్యంతో మిగిలారు. మరో 150-200 మంది ఓనర్లు, డ్రైవర్లు బడ్డీ కొట్లు, టైర్ల కొట్లలో, ప్లాట్ ఫాం బండ్లు, చివరకు ముఠా పనుల్లోకి వెళ్తూ, రోజూవారీ ఆదాయం కోసం పోరాడే స్థితికి చేరారు. ఏపీ సహా పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న నిరసనల దృష్ట్యా ఆ చట్టం అమలును కొన్నాళ్లుగా నిలిపివేశారు. ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో పునః నిర్ణయాన్ని త్వరలో వెలువరిస్తామని దాదాపు నెల క్రితం కేంద్ర ప్రభుత్వ ప్రకటించింది. అయితే సవరణలు కాకుండా ఆ చట్టాన్ని రద్దు చేయాల్సిందేనన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలను అలసట కొద్దీ ఆపుకోవడానికి వీలుగా ప్రతీ 50 కి.మీ.లకు ఒక పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని వాజపేయి ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టింది. రోడ్డు పన్నుల రూపేణా వసూళ్లు గట్టిగానే జరుగుతున్నా సౌకర్యాల కల్పన నిర్ణయాలు నేటికీ అమలు కావడం లేదు. నేరాలు, ప్రమాదాలు, హిట్ అండ్ రన్ ఘటనలు జర క్కుండా ఉండాలంటే 'సేఫ్ అండ్ సెక్యూర్డ్ పార్కింగ్ జోన్' కావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

పెదపాడు : కేంద్ర ప్రభుత్వం ట్రక్, వాహన డ్రైవర్లపై తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో వాహన డ్రైవర్లు కలపర్రు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఆందోళనకు దిగారు. ఈ చట్టం వల్ల వాహన డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ నినాదాలు చేశారు. ఆందోళనలో జయహో రథసారధి డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు, పెద్దసంఖ్యలో వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

దుర్వినియోగానికి ఆస్కారం..



ప్రాక్టికల్ సమస్యలు పట్టించుకోకుండా థియ్రటికల్‌గా చేసిన చట్టం ఇది. హిట్ అండ్ రన్ 160.2 చట్టం ద్వారా థియ్రటికల్‌గా తక్షణ చికిత్స అందుతున్నా ప్రాక్టికల్‌గా అబ్యూజింగ్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఎవరిపై కోపం ఉన్నా ఈ చట్టాన్ని అడ్డు పెట్టుకుని శిక్ష పడేలా చేయించడానికి ఆస్కారం ఉంది. సుదీర్ఘ శిక్ష నిర్ణయం కారణంగా రాజకీయ జోక్యాలు ఎక్కువైపోతాయి. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం జరగాలి.

- గొట్టుముక్కల రోనాల్డ్‌రాజు, హైకోర్టు సీనియర్ న్యాయవాది

ఆర్థికంగా చితికిపోతున్నాం..



ప్రమాదాలు, నష్ట పరిహారాలతో సగమైతే, బీమాలు రాక, ఆర్థిక సమస్యలు తీర్చలేక మరో సగం చితికి పోతున్నాం. ఇన్సూరెన్స్‌ల మాయాజాలం అనేది ప్రమాదం జరిగాక క్లయిమ్‌కు దరఖాస్తు చేసుకునే వరకు ఎవరికీ తెలీదు. 160.2 చట్టాన్ని రద్దు చేసి, ఫ్రీ అండ్ సెక్యూర్డ్ పార్కింగ్ జోన్లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలి.

- సత్యనారాయణ, లారీ ఓనర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వేణు ,శ్యామలాదేవి

ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తాం

2 వేల మందికి వైద్య పరీక్షలు..కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి

మొగల్తూరు, జనవరి 20: యూకె ఇండియా డయాబెటిక్ ఫుడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణంరాజు మెమోరియల్ పేరిట ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తామని కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తెలిపారు. శనివారం కృష్ణంరాజు జయంతి పురస్కరించుకుని మొగల్తూరు అభ్యాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి సుమారు రెండు వేల మంది వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో కొంతమందికి గ్యాంగ్రీన్ వ్యాధి సోకినట్టు భావించడంతో కొందరిని హైదరాబాద్ అపోలో, మరికొందరిని భీమవరం వర్మ ఆసుపత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో వైద్య సేవలు పొందిన రోగులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు వేణు కవర్తపు, వర్మ, విజయరామ్ పాపినేని, శ్రీనివాస శేష బట్లూరు, సునీత సాగ్, అమర్నాథ్ రెడ్డి, కెవిఎస్ దన్వంతరీ నాయుడు, వెంకట దీప్తి, జితేంద్ర చైతన్య, నాగరాజులతో పాటు పలువురు వైద్యులు రోగులకు సేవలందించారు. మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు, టీడీపీ నాయకుడు కొవ్వలి రామ్మోహన్ నాయుడు, బీజేపీ నాయకులు డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్, రావూరి సుధ తదితరులు శిబిరాన్ని సందర్శించారు.

వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తాం

కంటికి కనిపించని ప్రమాదకరమైన షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఇంగ్లాండ్‌కు చెందిన ప్రముఖ డయాబెటిక్ ఫుట్ సర్జన్ డాక్టర్ వేణు కవర్తపు తెలిపారు. సుగర్ వ్యాధి కారణంగా సంక్రమించే గ్యాంగ్రీన్ ప్రమాదకరమైనదని ఈ వ్యాధి సోకిన వారికి తెలియకుండానే పాదాల పగుళ్ళు, పుండ్లు, గాయాలు, స్పర్శ కోల్పోతారన్నారు. కృష్ణంరాజు జీవించి ఉండగానే ఈ వ్యాధిపై రోగులకు వైద్యసేవలందించాలని కోరారని అనివార్య కారణాల వల్ల ఆ సమయంలో రాలేకపోయానన్నారు. ఇకపై వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్యాంగ్రీన్ వ్యాధి సోకిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

ఘనంగా కృష్ణంరాజు జయంతి వేడుకలు



కృష్ణంరాజు జయంతి వేడుకలు శనివారం ఆయన సొంతూరు మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ఆయన నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి వందలాది మంది అభిమానులు, స్థానికుల సమక్షంలో కేక్ కట్ చేసి కృష్ణంరాజు శిష్యుడు మాధవనాయుడుకు తినిపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్ శ్యామలాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముత్యాపల్లి గ్రామంలో నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

మహా శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట చర్యలు

ఐటీడీఏ పీవో సూర్యతేజ

పోలవరం, జనవరి 20 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సూర్యతేజ సూచించారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో శనివారం జరిగిన శివరాత్రి ఉత్సవాల తొలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులంతా సమష్టి కృషితో పనిచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలన్నారు.పట్టిసీమ పంచాయతీకి నిధులు లేవని దేవదాయశాఖ ఉత్సవాల ఖర్చులు భరించాలని గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శులు కోరారు. రెండో సమావేశంలో ఈ విషయంపై నిర్ణయం తెలియజేస్తామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య మాట్లాడుతూ అధికారులు గతేడాది పొర పాట్లు, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలన్నారు. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గజ ఈతగాళ్లకు, పడవల వాళ్లకు, నదీ తీరంలో చలువ పందిళ్ళ, ఇతర పని చేసిన వాళ్ళకు ఇప్పటికీ సొమ్ములు చెల్లించలేదని త్వరిత గతిన వారికి సొమ్ములు చెల్లించకపోతే మళ్లీ పనులకు వచ్చే అవకాశాలు లేవని తహసీల్దారు బి.సుమతి సూచించారు. గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకుడు సబ్బారపు శ్రీరామ్మూర్తి, ఇతర నాయకులు తమ అభిప్రాయాలు చెప్పబోతుండగా వైసీపీకి చెందిన ఎంపీపీ వెంకటరెడ్డి అడ్డుకుని చెప్పనివ్వలేదు. సమావేశంలో ఉన్న ఆర్డీవో, ఇతర అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం. ఎంపీడీవో జి.శ్రీను, ఈవో సంగమేశ్వరశర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

31 వరకు ఓపెన్ టెన్త్,ఇంటర్ అడ్మిషన్లకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 20 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో తత్కాల్ పథకం కింద అపరాధ రుసుం చెల్లింపుపై అడ్మిషన్లు పొందేందుకు గడువును ఈనెల 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని డీఈవో శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలి పారు. తత్కాల్‌లో అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ ఈ ఏడాది జూన్/జూలై నెలల్లో జరుగబోయే పరీక్షలకు అర్హత లభిస్తుందన్నారు. వెయ్యి రూపాయలు అపరాధ రుసుంతో అడ్మిషన్ ఫీజుని గ్రామ/వార్డు సచివాలయం, ఓపెన్ స్కూల్స్ అధీకృత సెంటర్‌లలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించి ప్రవేశాలు పొంద వచ్చునని వివరించారు.

గణతంత్ర వేడుకలకు రావికంపాడు స్కౌట్ విద్యార్థినులు



కామవరపుకోట, జనవరి 20 : ఈనెల 26న పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న గణతంత్ర వేడుకలకు రావికంపాడు జిల్లా పరిషత్ హైస్కూలు స్కౌట్ విద్యార్థినులు ఎంపికైనట్టు జిల్లా స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు, ఆర్గనైజర్ శ్రీహరిలు తెలిపారు. విద్యార్థులు సంక్రాంతి సెలవుల్లో చలి లెక్క చేయకుండా ప్రత్యేక శిక్షణ పొందారని, పట్టుదలతో లక్ష్యాలనుసాధించడం వలన వీరిని జిల్లా యంత్రాంగం ఎంపిక చేసిందని చెప్పారు. ఉద్యమంలో చేరిన వారు దళాలుగా ఏర్పడతారని, ప్రతీ దళానికి ఒక పతాకం, వాయిద్యాలు ఉంటా యన్నారు. ప్రతీ జట్టు ఒక నాయకుని ఆధీనంలో ఉంటుందన్నారు. సత్యం మాట్లాడడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యావసర సమయాల్లో సాయపడడం వంటివి చేయవచ్చునన్నారు. హెచ్‌ఎం ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.



శ్రీరాముడు హిందువులందరికీ ఆరాధ్యదైవం.. భోగ భాగ్యాలను వదిలి అరణ్యవాసంలో ఎన్నో కష్టాలకు ఓర్చి ఆదర్శ పురుషుడిగా నిలిచాడు. రామాలయం లేని ఊరు ఉండదు.. రాముని ఆరాధించని భక్తుడు లేడు.. రేపు అయోధ్యలో నిర్మించిన రామాలయంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించనున్నారు.. ఆ దివ్య ఘట్టం భక్తులందరికీ మహోన్నతం.. మహిమాన్వితం.. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ రామాలయాల చరిత్రను ఒకసారి తెలుసుకుందాం..

అంతా రామమయం

అపర భద్రాద్రి చనుబండ కోదండరాముని ఆలయం

చాట్రాయి, జనవరి 20: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఇక్కడ కూడా భక్తులు భజనలు, ప్రత్యేక పూజలు, రామనామ సంకీర్తలు నిర్వహించేందుకు భక్త బృందాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండలోని శ్రీకోదండ రామస్వామి ఆలయం ఉమ్మడి కృష్ణా జిల్లాలో పురాతనమైనది. 310 ఏళ్లుగా భక్తుల ఆరాధ్య దైవంగా విలసిల్లుతూ అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇక్కడి శ్రీరాముడి దర్శనం గొప్ప భాగ్యంగా ప్రజలు భావిస్తుంటారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ ఆలయాన్ని నరశింహారావుపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల రామిరెడ్డి అనే రామభక్తుడు 1713లో నిర్మించారు. పత్తి వ్యాపారం చేసే రామిరెడ్డి ఏడాది పొడవునా నిష్ట, నియమాలతో గోటితో ధాన్యం వలిచి తలంబ్రాలు తయారు చేసుకొని శ్రీరామనవమికి భద్రాచలం వెళ్ళి రాములోరి కల్యాణంలో వినియోగించి వచ్చేవారు. వృద్ధాప్యం రావడంతో ఇక నుంచి ఎలా రాగలను అని స్వామీ అని ధ్యానిస్తూ ఉండేవాడు. ఒక రోజు వ్యాపార నిమిత్తం తెలంగాణ ప్రాంతం మధిరకు వెళుతుండగా కనుమూరు గ్రామం దగ్గర పర్వతం వద్దకు వెళ్లేసరికి పొద్దుకూకింది. గాలి, వాన ప్రారంభమైంది. మహారణ్యంలో దారి కానరాక తన సహచరులతో రామిరెడ్డి అక్కడే మకాం చేశారు. శ్రీరాముని ధ్యానించుచూ రామిరెడ్డి నిద్రించగా, స్వామి స్వప్నంలో ప్రత్యక్షమై నీవు ఇక నుంచి భద్రాచలం రానవసరం లేదని, ఈ పర్వత ప్రాంతంలో పూజా విధానాలు లేకుండా ఉన్నాను.. తీసుకువెళ్ళి ప్రతిష్ఠించి కల్యాణం జరిపించమని ఆజ్ఞాపించెను. రామిరెడ్డి ఉదయాన్నే పరిజనులతో దక్షణాభిముఖుడై పరిసరాలను పరిశీలించగా ఒక రాతిపైన తీగలచే చుట్టుకొనబడి ఉన్న బలుసు పొదలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు కన్పించాయి. దీంతోరామిరెడ్డి భక్తి పారవశ్యుడై పత్తి గోనెలలో స్వాములను భద్రపరుచుకొని ఎడ్లుల బండిపై తన స్వగ్రామం నరశింహారావుపాలెం వస్తుండగా చనుబండ గ్రామం వచ్చాక ఎద్దులు కదలకుండా పడుకున్నాయి. ఎంత ప్రయత్నించినా ఎద్దులు లేవకపోవడంతో రామిరెడ్డి బృందం అక్కడే విశ్రమించారు. రామిరెడ్డికి ఆ రాత్రి స్వప్నంలో శ్రీరాముడు ప్రత్యక్షమై ఇక్కడే ఆలయం నిర్మించాలని ఆదేశించెను. అంతట రామిరెడ్డి తన శక్తినంతయు దారపోసినా ఆలయం పూర్తికాకపోవడంతో గ్రామాలకు వెళ్లి భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణం పూర్తిచేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇది అపరభద్రాద్రిగా పేరుగాంచి పుణ్యక్షేత్రం అయ్యింది. ఇక్కడ జరిగే శ్రీసీతారామ కల్యాణానికి చుట్టుపక్కల మండలాలు,జిల్లాల నుంచే కాకుండా సరిహద్దున తెలంగాణ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భద్రాచలం వెళ్ళి శ్రీసీతారాముల కల్యాణం తిలకిస్తే ఎంత ముక్తి లభిస్తుందో ఇక్కడ కల్యాణం చూసినా అంతే ఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం.

వెలంపేట ఆరాధ్యదైవం కోదండరాముడు



ఆకివీడు : వెలంపేట వాసులతో పాటు చుట్టుపక్కల ప్రజలకు ఆరాధ్య దైవం కోదండ రామాలయం. ఈ ప్రాంతవాసులు ఏ పనిచేయాలన్నా ముందుగా శ్రీరాముని దర్శించుకొంటారు. 1979లో దేవాలయం నిర్మాణం చేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. దీనికి ముందు మట్టి విగ్రహాలుండేవి. వాటికే ఉత్సవాలు నిర్వహించేవారు. అక్కడే బడి కూడా ఉండడంతో చదువుకొనేవారు. అందువల్ల దీనిని గుడిబడి అనేవారు. ఈ గుడిబడిలో చదువుకున్న వారందరు నేడు మంచి స్థాయిలో ఉన్నారు. ఉగాది, శ్రీరామనవమి, వినాయకచవితి, దేవీనవరాత్రులు, సంక్రాంతికి గోదాకళ్యాణం, ముక్కోటి ఏకాదశి, ప్రతీ శనివారం ప్రత్యేక అలంకరణ చేస్తారు. ఉండి నియోజకవర్గంలో పోటీ చేసే ప్రజాప్రతినిధులు ముందుగా వచ్చి ఈ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయం.. ఉత్సవమూర్తులు

రామావతారంలో వేములదీవి వెంకన్న



నరసాపురం రూరల్, జనవరి 20: మండలంలోని వేములదీవి గ్రామంలో కొలువైన వైభవ వెంకటేశ్వరస్వామి శనివారం రామావతారంలో అలంకరించారు. ఈ అలంకరణ చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధన నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వడ్డించారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్షకు 3,725 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 20 : ఆరో తరగతిలో ప్రవేశాలకు శనివారం జరిగిన జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 24 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 5,366 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 3,725 మంది హాజరయ్యారు. 1641 మంది గైర్హాజరయ్యారు. సాధారణంగా ఏటా ఏప్రిల్‌లో జరిగే ఈ పరీక్షను సార్వత్రిక ఎన్నికల కారణంగా ముందుగానే నిర్వహించారు. ఫలితాలు ఎన్నికల కోడ్ రాకపోతే నెల రోజుల్లోగా, కోడ్‌వస్తే మే నెలలో ప్రకటించే అవకాశం ఉంది. పరీక్షా కేంద్రాలను ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈవోలు శ్యాంసుందర్, వెంకటరమణలతో పాటు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎల్.శ్రీకాంత్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేశారు. పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకన నిమిత్తం హైదరాబాద్ జేఎన్‌వీ ప్రాంతీయ కార్యాలయానికి పోలీసు బందోబస్తు నడుమ తరలించారు.



ఏలూరులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఈవో శ్యాంసుందర్





రూమ్ నంబర్ వెతుక్కుంటూ.. చివరి నిమిషంలో పరుగు పరుగున..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరసాపురం డీఎస్పీ మనోహరాచారి..స్వాధీనం చేసుకున్న అభరణాలు

చోరీ బంగారం అమ్మేందుకు వెళుతూ దొరికేశారు

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.14 లక్షల విలువైన అభరణాలు స్వాధీనం

పాలకొల్లు టౌన్, జనవరి, 20: నరసాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 19 చోరీలకు పాల్పడిన గోడి సతీష్‌కుమార్, మండేలా నాగ భాస్కరరావు, కొత్తపల్లి నరేష్ ఈముగ్గురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.14 లక్షలు విలువ చేసే 30 కాసులు బంగారం, 3 కేజీల వెండి అభరణాలతో పాటు ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు నరసాపురం డీఎస్పీ మనోహరాచారి తెలిపారు. ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు పాలకొల్లు టౌన్ సీఐ డి.రాంబాబు ఆధ్వర్యంలో ఈనెల 19న పాలకొల్లు టౌన్ పరిధిలో గల పూల పల్లి వైజంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా భీమవరం వైపు వెళ్తున్న ఒక మోటార్‌సైకిల్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తూ పోలీసులను చూసి బండి వెనకకు తిప్పి పారిపోవడానికి ప్రయత్నం చేస్తుండగా పాలకొల్లు టౌన్, రూరల్ ఎస్‌ఐలు బి.శ్రీనివాసు, ముత్యాలరావు సిబ్బంది సాయంతో వాళ్లను పట్టుకున్నారు. విచారణ చేయగా పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పూలపల్లి టర్నింగ్ నందు హోటల్‌లో జరిగిన రాత్రిపూట చోరీ చేసినట్లు, అదేవిదంగా పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఇళ్లల్లో చోరీలు, మోటార్ సైకిల్ దొంగతనాలు చేసినట్టు ఒప్పు కున్నారు. దొంగిలించిన బంగారు వస్తువులు భీమవరంలో అమ్మేందుకు వెళ్తుండగా వారిని పట్టుకున్నట్టు తెలిపారు. వీరు 19 నేరాలు చేసినట్టు ఒప్పుకున్నారన్నారు. సీఐ రాంబాబును, ఎస్‌ఐలు బి.శ్రీనివాస్, ముత్యాలరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పోడూరు ఎంపీపీ భర్తకు గాయాలు

పోడూరు, జనవరి, 20 : పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి భర్త సాగర్ శుక్రవారం రాత్రి విజయవాడ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభకు సభకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు స్టేట్ సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు తెలిపారు. ఆయన విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారన్నారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాగర్ వద్దకు వెళ్లి పరిస్థితి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం అందించాలని సూచించినట్లు తెలిపారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆకివీడు, జనవరి 20: మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బండి శ్రీనివాస్ భీమవరం నుంచి దుంపగడప వెళ్ళుతుండగా దుంపగడప నుంచి ఆకివీడు వైపు వస్తున్న మోటారు సైకిలిస్టు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో శ్రీనివాస్ కాలు, తలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు మేర ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

అసభ్య ఫోన్‌కాల్స్‌పై ఫిర్యాదు.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 20 : ఉన్నతాధికారులమంటూ ఒక ఆశ వర్కర్ వివరాలు సేకరించి తరువాత వీడియో కాల్స్ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో ట్రైనీ డీఎస్పీ విద్య కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెంలోని ఒక సచివాలయంలో పనిచేస్తున్న ఆశ వర్కర్‌కు ఈనెల 17న ఒక వ్యక్తి ఫోన్ చేసి వివరాలు అడగ్గా ఉన్న తాది కారులేమోనని వివరాలు చెప్పింది. మరో ఐదుగురి ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చింది.అప్పటి నుంచి బాధిత ఆశ వర్కర్ ఫోన్‌కు వాట్సప్ కాల్స్, వీడియో కాల్స్, బూతు వీడియోలు రావడంతో బాదితురాలు సోమవారం ఫిర్యాదు చేయడంతో ట్రైనీ డీఎస్పీ విద్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని కొడుకు దాడికి యత్నం

జంగారెడ్డిగూడెం, జనవరి 20 : మతిస్థిమితం లేని కొడుకు తల్లి తండ్రులను కత్తితో చంపడానికి ప్రయత్నించిన సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వెన్నెల సత్యన్నారాయణకు ముగ్గురు సంతానం. చివరి కొడుకు పవన్ శ్రీనివాస్‌కు మతిస్థిమితం లేదు.సోమవారం ఇంట్లో ఉన్న బట్టలన్నింటినీ శ్రీనివాస్ తగల పెట్టి తండ్రి సత్యన్నారాయణను,తల్లిని చంపడానికి కత్తితో ప్రయత్నించాడు. తండ్రి ఫిర్యాదుతో ట్రైనీ డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 20 : బెల్ట్ షాపులో మద్యం విక్రయిస్తున్న ఒక మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన మంగదేవి అదే గ్రామంలో బెల్ట్‌షాప్‌ను నిర్వహిస్తుండగా ట్రైనీ డీఎస్పీ విద్య, సిబ్బంది దాడి చేసి ఇమె వద్ద ఉన్న రూ.1050 విలువైన ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

ఉంగుటూరు, జనవరి 20 : ఉంగుటూరు మండలం అక్కపల్లిగోకవరం గ్రామంలో ముక్కనుమ నాడు చికెన్ తక్కువ ధరకు అమ్ముతున్నాడని పక్కన ఉన్న చికెన్ సెంటర్ యజమాని కూతాడ దుర్గారావును కర్రతో దాడి చేసిన ముగ్గురుని అరెస్టు చేసినట్టు చేబ్రోలు ఎస్‌ఐ రవికిరణ్ చెప్పారు. దాడి చేయడంతో గాయాలైన దుర్గారావుని తొలుత తాడేపల్లిగూడెం అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ఒకే కుటుంబానికి చెందిన నల్లబాయి శ్రీను,అతని కుమారుడు రాజు,భార్య దుర్గలను అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు శనివారం హజరు పర్చగా రిమాండ్ విధించారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 20 :అక్రమంగా నిమ్మ తోటలోకి ప్రవేశించి చెట్లు నరుకుతూ అడ్డుకున్న వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. టి.నరసాపురం గ్రామానికి చెందిన పలివెల నాగలక్ష్మికి గ్రామ శివార్లలో నిమ్మతోట ఉంది. ఈనెల 17వ తేదీన తోటలోకి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామానికి చెందిన పలివెల వెంకటేశ్వరరావు, దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామానికి చెందిన మిద్దే సీతమ్మలు మరికొందరు వ్యక్తులతో ప్రవేశించి నిమ్మ చెట్లు నరుకుతుండగా, తోటలో పని చేస్తున్న నాగలక్ష్మి, మామ మంగయ్య అడ్డుకోగా మంగయ్యను చంపుతామని బెదిరించారు. నాగలక్ష్మి ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేంద్ర కుమార్‌తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న 3వ అదనపు గౌరవ న్యాయమూర్తి, చైర్‌పర్సన్ శ్రీసత్యాదేవి

లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై ప్రతీ మహిళకు అవగాహన అవసరం

3వ అదనపు న్యాయమూర్తి శ్రీసత్యాదేవి

భీమవరం క్రైం, జనవరి 20 : మహిళలు, బాలికలను రక్షించడానికి ఎన్ని చట్టాలు ఉన్నా అవగాహన లేకపోతే వాటిని సమర్ధవంతంగా విని యోగించుకోలేమని 3వ అదనపు గౌరవ న్యాయమూర్తి, చైర్‌పర్సన్ పి.శ్రీసత్యాదేవి అన్నారు. శనివారం భీమవరం కోర్టు సమావేశ మందిరంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ప్రత్యేక అవగాహన సమావేశం జరిగింది. సత్యాదేవి మాట్లాడుతూ ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు సామూహికంగా ఖండించడంతో పాటు బాధితురాలికి సంఘీభావం తెలిపి ఆమె తరుపున ధైర్యంగా పోరాడి ఫిర్యాదుకు సహకరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకుంటే బాధితులకు టోల్‌ఫ్రీ నెంబర్లు ఎలా ఉంటాయో అదేవిధంగా మహిళలపై లైంగిక వేధింపులపై కూడా టోల్‌ఫ్రీ నెంబరు బోర్డులు పెట్టాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు అప్పలస్వామి, పవన్‌కుమార్, సురేష్ బాబు, ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణరావు, ఐసీడీఎస్ అధికారి సుజాతరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ సాగు వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఆయిల్‌పామ్ సాగుతో విదేశీ మారక నిల్వలు

పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

పెదవేగి, జనవరి 20 : దేశంలో నూనె కొరతలను తగ్గించడానికి ఆయిల్ పామ్ సాగు దోహదపడుతుందని కేంద్రప్రభుత్వ కార్యదర్శి మనోజ్ అహూజా అన్నారు. పెదవేగిలోని భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనాలయమ్ (ఐఐవోపీఆర్)ను శనివారం కేంద్ర బృందం పరిశీలించింది. ఐఐవోపీఆర్‌లో జరుగుతున్న పరిశోధనలు, సాగు అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, మేలైన వంగడాల తయారీ వంటివి బృందం పరిశీలించింది. మనోజ్ మాట్లాడుతూ దేశీయంగా నూనెల కొరత ఎక్కువగా ఉందన్నారు. నూనెల దిగుమతితో విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయని, విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ఆయిల్‌పామ్ సాగు దోహదపడుతుందని చెప్పారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ పీకే.సింగ్, సహాయ కార్యదర్శి ఏకే సాహూ,జిల్లా ఉద్యాన శాఖాధికారి కే.రామ్మోహన్‌రావు, ఏలూరు ఆర్డీవో ఖాజావలి, ఐఐవోపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న బంగ్లాదేశ్ బృందం

ప్రకృతి సాగు ఆరోగ్యదాయకం

అమ్మపాలెంలో ప్రకృతి సాగు పరిశీలించిన బంగ్లాదేశ్ బృందం

పెదవేగి, జనవరి 20 : ప్రకృతి సాగుతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలో ప్రకృతి సేద్యాన్ని బంగ్లాదేశ్ బృందం శనివారం పరిశీలించింది. గ్రామంలో సేంద్రీయ విధానంలో సాగవుతున్న కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలను బృందం పరిశీలించింది. ఇదే తరహాలో బంగ్లాదేశ్‌లో పంటల సాగు చేపడతామని బంగ్లాదేశ్ పీకేఎస్‌ఎఫ్ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ అకొండ మహ్మద్ రఫీక్ ఇస్లామ్ తెలిపారు. అమ్మపాలెంలో ప్రకృతి సాగు ఎంతగానో ఆకట్టుకుందని తమ దేశంలో కూడా ఈ సాగును ప్రారంభిస్తామని చెప్పారు. వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతిరైతు ఈ విధానంలో సాగు చేపడితే వ్యాధులు దరిచేరవన్నారు. బంగ్లాదేశ్‌కి చెందిన సభ్యుల బృందం, ప్రకృతి వ్యవసాయం డీపీఎం బి.తాతారావు, పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అల్లూరి సీతారామరాజు నాటకం



భీమవరంటౌన్, జనవరి 20 : మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సూర్యోదయ ఆర్ట్స్ ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గిరిజనల్లో విప్లవాగ్ని రగిలించి వారితో స్వాతంత్ర్య పోరాట ఉద్యమాన్ని నడిపిన సంఘటనలు ఆకట్టుకున్నాయి. నాటకం జరుగుతున్నంత సేపు దేశభక్తి వెల్లివిరిసంది. అనంతరం కళాకారులను సత్కరించారు.

ఆర్యవైశ్యులకు టికెట్లు ఇవ్వండి


నాదేండ్ల మనోహర్‌కు అభ్యర్థుల జాబితా అందజేస్తున్న అంబికా కృష్ణ

ఏలూరుటూటౌన్, జనవరి 20: రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలని ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబికా కృష్ణ అన్నారు. జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ కన్వీనర్ నాదేండ్ల మనోహర్‌ను శనివారం కలిసి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్యవైశ్యులకు అత్యధికంగా జనసేన సీట్లు కేటాయిస్తుందని మనోహర్ తనకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అద్భుతం


మాట్లాడుతున్న చింతమనేని

ఏలూరుటూటౌన్, జనవరి 20: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు అద్భుతమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కోటేశ్వరదుర్గాపురంలో శనివారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తొలుత చేటపర్రు నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. వైసీపీతో ప్రజలు విసుగు చెందారని, టీడీపీకి పట్టం కట్టేందుకు ఎదురు చూస్తున్నారని అన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబేరావాలి

● లింగపాలెం: మండల కేంద్రమైన లింగపాలెంలో మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లి కార్జున్‌రావు ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మోరంపూడి మాట్లాడుతూ , రాష్ట్రం బాగుపడాలంటే సీఎంగా చంద్రబాబే ఉండాలన్నారు. తాతిన రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కామవరపుకోట: సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు ఆధ్వర్యంలో శనివారం తాడిచర్లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కళ్ళచెరువులో మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ , రాజులపాటి లక్ష్మీనారాయణ, చెలికాని కిరణ్, సిరిగిబత్తుల నాగరాజు, పెనుమాల కిరణ్, కొప్పుల జయరాజు, పొద్దుటూరి యేసు, దాసరి పోతురాజు, చెన్నాపురపు కొండయ్య, చావా అభిరామ్ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

'రా కదలిరా' సభను విజయవంతం చేయండి


ఏలూరులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చంటి

ఏలూరుటూటౌన్/ఉంగుటూరు/ భీమడోలు, జనవరి 20: చంద్రబాబు చేపట్టిన రా కదలి రా మహాసభ ఈనెల 29న ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలులో జరుగుతుందనీ, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బడేటి చంటి పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ పాలనకు చరమగీతంపాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. బ్రోచర్‌ను ఆవిష్కరించారు. భీమడోలులో ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనే యులు, కొండబాబు, ముత్యాల స్వామి, కృష్ణంరాజు, విజయకుమార్ పాల్గొన్నారు.

పెన్షన్లు స్వపక్షీయులకేనా...

» వైసీపీ నేతల తీరుపై టీడీపీ నేత మంగిన ధ్వజం

పోలవరం, జనవరి 20 : పెన్షన్లు స్వపక్షీయులకేనా.. సామాన్యులకు లేవా అని టీడీపీ మండల నేత మంగిన కొండ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నివాసం వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ, పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, విడోలు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. కొందరు అధికార పార్టీ నేతలు తమ వారికి మాత్రమే పెన్షన్లు మంజూరు చేయించి అర్హులైన వారికి 25 మందికి పెన్షన్లు నిలిపివేశారని ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రజాప్రతినిధుల వైఫల్యమా అని ప్రశ్నించారు. పెన్షన్ల మంజూరులో అధికారుల తీరుపై ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. మంగిన పోశీరత్నం, మేడుం పార్వతి, పట్నాల దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు బాసటగా నిలవండి: సీపీఐ

జంగారెడ్డిగూడెం, జనవర 20 : నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ, ఎన్నో విజయాలు సాధించిన సీపీఐకు విరాళాలు అందజేస్తూ ప్రజా పోరాటాలకు బాసటగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయం నుంచి విరాళాల సేకరణను శనివాయం ఆయన ప్రారంభించారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా కార్మిక, రైతాంగ, యువజన, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. జె.వి. రమణ రాజు, కుంచె వసంత రావు, హనుమంతు, శీనయ్య, కంకిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ కర్మాగారం వద్దు

» వంకవారిగూడెంలో తహసీల్దారును అడ్డుకున్న గిరిజనులు


గ్రామ సభను వ్యతిరేకిస్తున్న గిరిజనులు

జీలుగుమిల్లి, జనవరి 20 : వంకవారిగూడెం పంచాయతీ శివారు గ్రామాల్లో ఆయుధ కర్మాగారం ఏర్పాటుకు తహసీల్దారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభను గిరిజనులు అడ్డుకున్నారు. దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణ్కపేట, చీమలవారిగూడెం గిరిజనులకు శనివారం సచివాలయం వద్ద రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సుమారు 1,166 ఎకరాల భూమిని సేకరించేందుకు గ్రామస్థుల అనుమతి కోరారు. ఆమోదం తెలిపే పత్రాలపై సంతకాలు సేకరించాల్సి ఉండటంతో అధికారులు ఏర్పాటు చేసిన గ్రామసభను గిరిజనులంతా ముక్తకంఠంతో అడ్డుకున్నారు. ఆయుధ కర్మాగారం వద్దంటూ సచివాలయం వద్ద రోడ్డుపై గిరిజన సంఘాల నాయకులు బైఠాయించారు. తహసీల్దారు, కారును బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సభలు సమావేశాలు జరపవద్దని నినాదాలు చేశారు. సమస్యను తహసీల్దారు సందర్‌సింగ్ ఫోన్‌లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ గిరిజన సంఘాల నాయకులకు నచ్చ చెప్పి తహసీల్దారును గ్రామంలో నుంచి బయటకు తీసుకొచ్చారు. జంగారెడ్డిగూడెం తహసీల్దారు స్లీవజోజి, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరావు, గిరిజన సంఘాల నాయకులు తెల్లం రామకృష్ణ, దుర్గారావు, మడకం వెంకటేశ్వరావు పలు గిరిజన గ్రామాల మహిళలు ఉన్నారు.

హేలాపురిలో అడుగడుగునా సమస్యలే..


మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరుకార్పొరేషన్, జనవరి 20 : నగరంలో అన్నిడివిజన్లలో అడుగడుగు నా సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. జనసేన బృందం శనివారం దక్షిణపువీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు.మురిగినీరు పేరుకుపోయిందన్నారు. వేరుశెనగ ఫ్యాక్టరీ వద్ద మురుగు డ్రెయిన్‌లో బ్లాక్ అవుతుందన్నారు. దోమల బెడద పెరిగిందని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. మురుగు సమస్యను పరిష్కరించని పక్షంలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. నగిరెడ్డి కాశీ నరేష్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, అల్లు సాయిచరణ్, రవి, కందుకూరి ఈశ్వరరావు, బొత్స మధు పాల్గొన్నారు.

జనసేన పర్యటనతో అధికారుల్లో కదలిక

జనసైనికులు 11వ డివిజన్‌లో శనివారం పర్యటించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్నారన్న సమాచారం అందుకున్న శానిటరి సిబ్బంది అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై సోషల్ సర్వీస్

కుక్కునూరు, జనవరి 20: భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్ర, యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో శనివారం కుక్కునూరులో స్కిల్ డెవలప్‌మెంట్‌పై సోషల్ సర్వీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు.. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో వివరించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిశుభ్రతను పాటించాలి అనే అంశాలపై వివరించారు. జాషువ, రాంబాబు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

నలభై ఆకారంలో అంగన్‌వాడీల నిరసనలు..రాస్తారోకో..


పోలవరం, కుక్కునూరులో నలభై ఆకారంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

● లింగపాలెం, జనవరి 20: స్థానిక తహసీల్దార్ కార్యాల యం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. వ్యవసాయ కార్మికసంఘ అధ్యక్షుడు పి.రామ కృష్ణ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండి పడ్డారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బి.జె.ఎస్ కుమారి, వి.ఈశ్వరి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి అంగనవాడీలు మానవహారం, రాస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. సీఐటీయూ నాయకురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. రామలక్ష్మి, పుష్ప, శ్రీదేవి, రామాయమ్మ, మున్నీ, నూర్జహాన్, కృపామణి పాల్గొన్నారు.

● చింతలపూడి : తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ నేత ఎం.వసంతరావు మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించడం కాదని, అంగన్‌వాడీలకు న్యాయం చేయాలన్నారు. టి.బాబు, బి.కృష్ణ, శ్రీనివాసరావు, బుచ్చిబాబు, అంజమ్మ, మరియమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు.

● టి.నరసాపురం : డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. పి.పనివర్ధిని, ఎస్.మార్తమ్మ, సత్యవతి, బాబీ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు విమర్శించారు. 40వ రోజు సమ్మె 40 అంకె రూపంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. పట్ల లక్ష్మయ్య, వై.సాయికిరణ్, కుంజా నాగలక్ష్మి, వెంకటన్నబాబు, కారం రాజేశ్వరి, టి.సురేష్, కాకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని ఐఎన్‌టీయుసీ నేత రామ్మోహన్, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. జాతీయ రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కొండలరావు, జ్యోతి, మణి, జాన్సీ, అరుణ, చిలకమ్మ, పూర్ణావతి, వరలక్ష్మి, రాధిక, నాగలక్ష్మి ఉన్నారు.

● ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులో అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ నిర్వహించారు.

● భీమడోలు: అంగన్వాడీలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఖండించారు. కట్టా భాస్కరరావు, వెజ్జు శ్రీరామమూర్తి, మానుకొండ వీర్రాజు,స్వర్ణ కుమారి, చల్లా మణి, విజయ పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండల కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని యూనియన్ నాయకురాలు సరళాదేవి, అరుణ, దీప, సౌభాగ్య, భువన ప్రియాంక, మరియమ్మ, మరియరాణి, షేక్ సుభాషిణి పేర్కొన్నారు.

● కొయ్యలగూడెం : దీక్షా శిబిరం నుంచి ప్రధాన సెంటర్ వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఎస్.రాంబాబు, రత్నకుమారి, నాగవేణి, శ్రీదేవి, శ్యామలా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసే నైతిక హక్కు జగన్‌కు లేదు'

పోలవరం, జనవరి 20 : అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసే నైతికహక్కు ముఖ్యమంత్రి జగన్‌కు లేదని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి పి.ఎల్.ఎస్.కుమారి అన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం 40 ఆకా రంలో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. దీక్షా శిబిరం నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. హామీలు మాకొద్దు .. జీతాలు ఇవ్వాలి.. ప్రభు త్వ మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. కుమారి మాట్లాడుతూ, మహిళలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పిన పాలకులకు అంగన్వాడీలు మహిళలుగా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఆమరణ నిరాహార దీక్షలకు వెనకాడబోమని హెచ్చరించారు. సీపీఎం నేత సముద్రాల సాయికృష్ణ, సీఐటీయూ నేత బంగారు కృష్ణ సంఘీభావం తెలిపారు. పద్మావతి, చెరుకూరి మణి, సరస్వతి, హైమావతి, కుబ్ర, జుబేదా, ధనలక్ష్మి పాల్గొన్నారు.


బుట్టాయిగూడెం, లింగపాలెంలో రాస్తారోకో.. టి.నర్సాపురం, కామవరపుకోటలో నిరసనలు


మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

టెన్త్ విద్యార్థులకు 'విజయకేతనం' స్టడీ మెటీరియల్

» రేపటి నుంచే 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక

ఏలూరు ఎడ్యుకేషన్/ఏలూరుసిటీ, జనవరి 20 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల (ప్రైవేటు మినహా) హైస్కూళ్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాశాఖ ముద్రించిన 'విజయ కేతనం' స్టడీ మెటీరియల్‌ను శనివారం ఏలూరులో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. అన్ని సబ్జెక్టుల నిపుణులు 40 మందితో జిల్లా కామన్ పరీక్షల సంస్థ (డీసీఈబీ) స్టడీమెటీరియల్‌ను రూపొందించింది. 48 మండలాల్లో 37,847మంది విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచే విద్యార్థులు పాటించేలా టీచర్లు, హెచ్ఎంలు చర్యలుతీసుకోవాలన్నారు ఫిబ్రవరి 11, 21, మార్చి 2, 12 తేదీల్లో రివిజన్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. డీఈవో పి.శ్యాంసుందర్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, జడ్పీ సీఈవో కె.ఎస్.సుబ్బారావు, ఎస్ఎస్ఏ ఇన్‌చార్జి ఏఎంవో ఆర్.రామారావు, ఇన్‌చార్జి సీఎంవో జె.రవీంద్ర, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ జి.రాధాకృష్ణ మాట్లాడారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

జంగారెడ్డిగూడెం, జనవరి 20 : జంగారెడ్డిగూడెం విజయదుర్గమ్మ దేవాలయం కమిటీ సభ్యులు అయోధ్య రామాలయం నుండి వచ్చిన బాల రాముడు అక్షింతలను పట్టణంలో ప్రతి ఇంటికి, ప్రతి దుకాణంలో దాదాపు 20వేల అక్షింతల ప్యాకెట్‌లను పంపిణీ చేశారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి ఊరేగింపు

టి.నరసాపురం, జనవరి 20 : అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఏపిగుంటలో సర్పంచ్ ఎస్‌వీవీకెహెచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర స్వామిని మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి సహస్రకుంకుమార్చన

లింగపాలెం, జనవరి 20: రంగాపురంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్రకుంకుమార్చన పూజలు నిర్వహించారు. రెండో అన్నవరంగా పేరుగాంచిన సత్యనారాయణస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం రాత్రి సహస్రకుంకుమార్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాలచార్యులు పర్యవేక్షించారు. అధికసంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

సామూహిక భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 20 : అయోధ్యలో ఈనెల 22న విగ్రహ ప్రతిష్ఠా సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు డివిజన్లలోని దేవాలయాల వద్ద వివిధ కార్యక్రమాలను భక్తులు ఏర్పాటు చేశారు. 11వ డివిజన్‌లో కార్పొరేటర్ కోయ జయగంగ సత్తిబాబు ఆధ్వర్యంలో ఆశోకచక్రం వద్ద మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. పవరుపేట శ్రీకోదండ రామాలయంలో శ్రీరామనామ తారక మంత్ర పారాయణను ఆలయ ధర్మకర్త జవ్వాది మోహన్ విఠల్, ఆదిత్యలు ఏర్పాటు చేశారు. రామకోటిలో సామూహిక భజనలు, హనుమాన్‌చాలీసా పారాయణలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సంస్థలతో కలిపి అయోధ్య రామయ్య సంబరాల్లో పాల్గొనడం జరుగుతుందని రామమందిరం అధ్యక్షులు గాదంశెట్టి రమేష్‌కుమార్ తెలిపారు. వినాయకనగర్‌లోని వాసవీ క్లబ్ అక్షింతలు పంపిణీ.. విఘ్నేశ్వర సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివారి సంకీర్తనలు, 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహిస్తున్నట్టు వాసవీ క్లబ్ ప్రతినిధులు మద్దుల సౌజన్య, గోగుల రాధిక, గుగ్గిలం గీతాలక్ష్మి తెలిపారు. జూట్‌మిల్లు సెంటర్‌లోని ధర్మపురి ప్రాంగణంలో భజనలు, హనుమాన్‌చాలీసా పారాయణలు, వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తూర్పువీధి సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు ఏర్పాటు చేశారు.

రేపు ఏలూరులో అయోధ్య రాముని ఆనంద సంబరాలు

ఏలూరు క్రైం, జనవరి 20 : అయోధ్యలో రామ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న ఏలూరులోని అయోధ్యరాముని ఆనంద సంబరాలను రౌండ్‌టేబుల్, హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అంబికా గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అంబికా గ్రూపు సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. రెడ్‌క్రాస్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోధ్యరాముని ఆనంద సంబరాలను ఏలూరు రామకోటిలో శ్రీరామ ఆలయంలో నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం పెద్ద వంతెన (బెయిన్‌బజార్) నుంచి మేళతాళాలతో, తీన్‌మార్ డప్పులతో కోలాటాలతో భక్తులు భజన కార్యక్రమాలను అయోధ్య రాముని భారీ ఊరేగింపు నిర్వ హిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి, అంబికా సుదర్శన్, రత్నాకర్, కిషోర్, కనిగొళ్ళ సుధీర్, జిఎన్‌వి అమరేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు..



ఏలూరుకార్పొరేషన్, జనవరి 20 : స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గత నెల 28వ తేదీ నుంచి ఈనెల 17వ తేదీవరకు శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు జరిపారు. భక్తులు సామూహికంగా గోవిందనామ సంకీర్తనలు ఆలపించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, సిబ్బంది, ధర్మకర్తలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


బహుమతులు అందజేస్తున్న విజయబాబు

పెదవేగి, జనవరి 20 : క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జడ్పీ వైస్‌చైర్మన్ పి.విజయబాబు అన్నారు. మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడు తూ, ప్రతిఒక్కరూ క్రీడల్లో ప్రావీణ్యాన్ని సంపాదించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. నియోజకవర్గం స్థాయిలో ఎంపికైన బాలబాలికల జట్లు క్రీడాకారులను అభినందించారు. గంగాధరరావు, లక్ష్మణరావు, తాతా సత్య నారాయణ, జానంపేట బాబు, రాజ్‌మనోజ్, మార్గాని మల్లికార్జునరావు, మోర్ల శ్రీనివాసరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జట్టు సభ్యులు

నియోజకవర్గ పోటీలకు రంగాపురం క్రికెట్ జట్టు

లింగపాలెం, జనవరి 20: మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి క్రికెట్‌టోర్నమెంట్ నిర్వహించారు. రంగాపురం జట్టు గెలిచినట్లు ఎంపీడీవో తెలిపారు. నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ప్రకాష్‌రెడ్డి, శ్యామల, అలివేలుమంగ, కామేశ్వరరావు, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన

ఉంగుటూరు, జనవరి 20: 'ఎలక్ట్రో కెమికల్ డివైసిస్ ఫర్ బయో మెడికల్ అనే అంశంపై శనివారం నారాయణపురం డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అధ్యక్షత జరిగిన సదస్సులో పూర్వ విద్యార్థి శ్రీనివాసరావు నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

గిరిజన యువతీయువకులకు శిక్షణ

బుట్టాయగూడెం, జనవరి 20: ప్రభుత్వం గ్రూపు-2 నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో కెఆర్ పురం వైటీసీలో గిరిజన యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.సూర్యతేజ కోరారు. ఈ నెల 22 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఆధార్, కుల ధృవీకరణ, గ్రూపు-2 రిజిస్ట్రేషన్ స్లిప్ జత చేయాలన్నారు. వివరాలకు 94902 85277 సంప్రదించాలన్నారు.

లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

ఏలూరుటూటౌన్, జనవరి 20: రష్యాలో జార్ చక్రవర్తి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని, ప్రజలను చైతన్య పరిచి విప్లవాన్ని సాధించిన మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ శతవర్ధంతి కార్యక్రమం న్యూడెమొక్రసీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. రష్యాలో విప్లవం సాధించడానికి లెనిన్ చేసిన కృషి అమోఘమైందన్నారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రావు, నాని, ఏవీ రత్నం, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశు బీమా వినియోగించుకోవాలి

టి.నరసాపురం, జనవరి 20 : పశుపోషకులు వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ కె కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశు వైద్యశాల వద్ద శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పాడి పశువులు, గొర్రెలు, మేకలు ప్రమాదవశాత్తు మరణిస్తే పశుపోషకులు ఆర్థికంగా నిలదొక్కు కొనేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న పశు పోషకులకు 80శాతం, ఎగువనున్న వారికి 50శాతం రాయితీ కల్పించి మిగిలిన ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించండి

ఏలూరుటూటౌన్, జనవరి 20: ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. కలెక్టరేట్‌లో జాతీయ భద్రత మసోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఉపరవాణ కమిషనర్ ఎస్.శాంతకుమారి, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, జనవరి 20 : రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి. ఏలూరు లంకపేటకు చెందిన ములపర్తి విజయ్‌బాబు (30) అనే యువకుడు శనివారం సాయంత్రం ఏలూరు పవర్‌పేట రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలపై మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 20 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఏలూరు సమీపంలో శనివారపుపేట హైస్కూలు సమీపంలో నివాసం ఉంటున్న తేరా సతీష్ (30) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తన ఇంటి వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఏడు మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి: కలెక్టర్

ఏలూరుసిటీ, జనవరి 20: ఓటుహక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక గోదావరి సమావేశ మందిరంలో శనివారం మెప్మాగ్రూపు మహిళలతో ఓటరుగా నమోదు, ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో 86 నుంచి 88 శాతం పోలింగ్ జరిగినప్పటికీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 67 శాతం మాత్రమే పోలింగ్ జరిగిందన్నారు. ఈ విడత పోలింగ్ 80 శాతానికి ఉండేలా ఓటర్లను చైతన్య పరచవలసిన అవసరం ఉందన్నారు. మెప్మా పీడీ బి ఇమ్మానియేల్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నా ఓటు- నా బాధ్యత' సెల్ఫీబోర్డు ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నా ఓటు -నా బాధ్యత అనే సెల్ఫీబోర్డును కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన కూడా సెల్ఫీ తీసుకున్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలి

ఏలూరుటూటౌన్, జనవరి 20: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ డీపీఆర్‌ఓ రమణారావును ఆదేశించారు. నూతనంగా నియమితులైన రమణారావు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను శనివారం కలిశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. డివిజన్ పీఆర్వో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

ఏలూరుటూటౌన్, జనవరి 20: రెవిన్యూ గెస్ట్ హౌస్‌లో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్‌ను కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో అదనపు జిల్లాకోర్టు ప్రారంభానికి ఆయన విచ్చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్, న్యాయమూర్తి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

జంగారెడ్డిగూడెం, జనవరి 20 : మహిళా ఉద్యోగినులు తమను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మౌనం వహించకుండా చట్టం ద్వారా న్యాయం పొందాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్.కిషోర్ కుమార్ అన్నారు. మహిళా చట్టాలపై న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రిసోర్స్ పర్సన్స్‌గా ఏవీవీ భువనేశ్వరి, బల్లే సాయికుమారి వ్యవహరించారు.

లోక్‌అదాలత్ తీర్పులకు అప్పీలు లేదు



మాట్లాడుతున్న మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు క్రైం, జనవరి 20 : లోక్‌అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ భవనంలో జిల్లా అధికారులతో శనివారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, విద్య, వైద్య, పోస్టల్, ఇన్సూరెన్సు, రియల్‌ఎస్టేట్, రవాణా, పారిశుద్ధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్ఇజీఎస్, టెలికం వంటి సేవలలో లోపం జరిగితే శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకునేలాగ చర్యలు చేపట్టాలన్నారు.

వివక్షత నిర్మూలనకే అవగాహన సదస్సులు


మాట్లాడుతున్న జడ్జి రామ్‌గోపాల్

ఏలూరు క్రైం, జనవరి 20 : నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొన్నిచోట్ల వివక్షతకు గురవుతున్నారని, దానిని నిర్మూలించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి. రామ్‌గోపాల్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ భవనంలో 'మహిళా ఉద్యోగినులపై జరుగుతున్న అత్యాచారాలు-నిరోధించడం' అనే అంశాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగినికి పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నా రు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ , డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు కె. శ్రీనాగలక్ష్మి, బార్ అసోసియేషన్ కార్యదర్శి నోముల రాముడు మాట్లాడారు.

'స్వచ్ఛ భారత్' పైలట్ ప్రాజెక్టుగా

దెందులూరు, కైకలూరు పంచాయతీలు


అధికారులతో కలిసి డంపింగ్‌యార్డ్ స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసన్

దెందులూరు, జనవరి 20 : గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణతో పాటు నూరు శాతం తాగు నీరు అందిస్తూ డంపింగ్ యార్డులు నిర్మించి ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకూ ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారుడు వెల్లూరి శ్రీనివాసన్ అన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఎంపీడీవో శ్రీలత, ఈవోపీఆర్డీ స్వామితో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యదర్శి శ్రీనివాసచౌదరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీకి 50 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాలని 20 మంది ఉంటే ఎలా అని ప్రశ్నించారు. జీతాలు చెల్లించే స్తోమత లేకపోవడంతో కార్మికులు రావడం లేదని చౌదరి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డ్‌కు వెంటనే స్థలాన్ని ఎంపిక చేయాలని వెల్లూరి అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్థిక వనరులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. నాగ విజయలక్ష్మి, రాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

180 కుటుంబాలకు బియ్యం లేనట్టేనా?

- గడువు ముగిసిపోయిందని ఇవ్వని వైనం
- పౌర సరఫరాల శాఖ పంపిణీలో జాప్యమే కారణం?



ముదినేపల్లి, జనవవరి 20 : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు శివారు సూర్యనారాయణ పురం గ్రామంలో చౌక ధరల దుకాణం నంబర్-2 పరిధిలోని సుమారు 180 కుటుంబాలకు ఈ నెల ఉచిత రేషన్ బియ్యం అందేలా లేవు. ఈ నెల పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేయాల్సిన బియ్యం సరఫరాలో జాప్యం కారణంగా గడువు ముగిసిందని ఎండీయూ వాహనాన్ని నిలిపేశారు. గడువు ముగిసిందంటూ ఎండీయూ వాహనం నిర్వాహకుడు ఆ వాహనాన్ని అక్కడే వదిలేశాడు. ఈ నెల 17న ముగియాల్సిన బియ్యం పంపిణీని మరో రోజు పొడిగించినప్పటికీ ఉచిత బియ్యం అందని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 18న కూడా పౌరసరఫరా శాఖాధికారుల అనుమతితో సూర్యనారాయణ పురంలో చౌక డిపో డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ జరిగింది. అయినా ఇంకా 180 కుటుంబాలకు బియ్యం అందలేదు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని తమకు ఈ నెల బియ్యం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ కె. శ్రీనివాస్‌ను వివరణ కోరగా సూర్యనారాయణపురంలో 180 కుటుంబాలకు బియ్యం పంపిణీ ఆగిపోయిందని డీఎస్‌వోకు సమాచారం పంపామని, ఆయన నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని తెలిపారు.

అత్యవసరమైతే ఎలా?

- పోలీస్ స్టేషన్‌లో మూగబోయిన ఫోను

కలిదిండి, జనవరి 20 : కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ల్యాండ్ ఫోను మూగబోయింది. సుమారు రెండు నెలలుగా ఫోను పని చేయటం లేదు. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగినప్పుడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించేందుకు ల్యాండ్ ఫోనుకు చేస్తుంటే పని చేయటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఎస్ఐ ప్రియకుమార్‌ను వివరణ కోరగా, సాంకేతిక లోపంతో ల్యాండ్ ఫోను పని చేయటం లేదని, ఫోను మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్రానికి తాళం వేసి జూదానికి అడ్డుకట్ట

ముదినేపల్లి, జనవరి 20 : 'జూదశాలగా అంగన్‌వాడీ కేంద్రం' శీర్షికన ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముదినేపల్లి మండలం పెయ్యేరు కాలనీలో మూతపడిన 4వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. భవనానికి తాళం వేసి జూదం జరగకుండా చర్యలు తీసుకోవాలని జారీ చేసిన ఆదేశాలతో శనివారం ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు అధికారి ఆనందబాబు ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఝాన్సీ భవనానికి తాళాలు వేశారు. భవనం ఆవరణలో కోడిపుంజుల పెంపకానికి పెట్టిన పరికరాలను తొలగించారు.

అవకతవకలపై పీడీకి నివేదిక

ముదినేపల్లి, జనవరి 20 : పెయ్యేరులో ఒక స్వయం సహాయక సంఘ సభ్యుల రుణ వాయిదాల సొమ్ము, పొదుపు సొమ్మును ఆ సంఘ అధ్యక్షురాలు బ్యాంకులో జమ చేయని ఉదంతంపై డ్వామా పీడీకి సమగ్ర నివేదికను పంపనున్నట్లు ముదినేపల్లి మండల వెలుగు ఏపీఎం టి.సత్యనారాయణ తెలిపారు. సంఘ సభ్యుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన పీడీ విజయరాజు సంఘ ఆర్థిక కార్యకలాపాలపై శనివారం నివేదిక కోరినట్లు తెలిపారు. పీడీ ఆదేశాలతో సంఘ సభ్యుల నుంచి వసూలు చేసి సొమ్మును సంఘ అధ్యక్షురాలు 2021 నుంచి బ్యాంకులో సక్రమంగా జమ చేయని విషయంపై వివరాలు సేకరించి నివేదిక పంపుతామని, ఆమె నుంచి సొమ్ము రికవరీకి కూడా చర్యలు తీసుకుంటామని ఏపీఎం తెలిపారు.



అధికారులతో కలిసి డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసన్

'స్వచ్ఛ భారత్' పైలట్ ప్రాజెక్టులుగా

దెందులూరు, కైకలూరు పంచాయతీలు

దెందులూరు, జనవరి 20 : గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణతో పాటు నూరు శాతం తాగునీరందిస్తూ డంపింగ్ యార్డులు నిర్మించి ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు వెల్లూరి శ్రీనివాసన్ అన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఎంపీడీవో శ్రీలత, ఈవోపీఆర్డీ స్వామితో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యదర్శి శ్రీనివాస చౌదరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీకి 50 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలని 20 మంది ఉంటే ఎలా అని ప్రశ్నించారు. జీతాలు చెల్లించే స్థోమత లేకపోవడంతో కార్మికులు రావడం లేదని చౌదరి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డ్‌కు వెంటనే స్థలాన్ని ఎంపిక చేయాలని వెల్లూరి అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్థిక వనరులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. నాగ విజయలక్ష్మి, రాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

శ్రీను కుటుంబంపై వేధింపులు మానుకోవాలి

కలిదిండి, జనవరి 20 : కోడి కత్తి శ్రీను కుటుంబీకులపై ప్రభుత్వం వేధింపులు మానాలని టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు డిమాండ్ చేశారు. శనివారం కలిదిండిలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీను కుటుంబీకుల దీక్షా శిబిరంలో కరెంట్ కట్ చేయడం దారుణమన్నారు. దళిత సంఘ నాయకులంతా ఐక్యంగా ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలన్నారు.



శ్రీరాముడు హిందువులందరికీ ఆరాధ్యదైవం.. భోగ భాగ్యాలను వదిలి అరణ్యవాసంలో ఎన్నో కష్టాలకు ఓర్చి ఆదర్శ పురుషుడిగా నిలిచాడు. రామాలయం లేని ఊరు ఉండదు.. రాముని ఆరాధించని భక్తుడు లేడు.. రేపు అయోధ్యలో నిర్మించిన రామాలయంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించనున్నారు.. ఆ దివ్య ఘట్టం భక్తులందరికీ మహోన్నతం.. మహిమాన్వితం.. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ రామాలయాల చరిత్రను ఒకసారి తెలుసుకుందాం..

అంతా రామమయం

అపర భద్రాద్రి
చనుబండ కోదండరాముని ఆలయం

చాట్రాయి, జనవరి 20: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఇక్కడ కూడా భక్తులు భజనలు, ప్రత్యేక పూజలు, రామనామ సంకీర్తలు నిర్వహించేందుకు భక్త బృందాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండలోని శ్రీకోదండ రామస్వామి ఆలయం ఉమ్మడి కృష్ణా జిల్లాలో పురాతనమైనది. 310 ఏళ్లుగా భక్తుల ఆరాధ్య దైవంగా విలసిల్లుతూ అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇక్కడి శ్రీరాముడి దర్శనం గొప్ప భాగ్యంగా ప్రజలు భావిస్తుంటారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ ఆలయాన్ని నరశింహారావుపాలెం గ్రామానికి చెందిన పుచ్చకాయల రామిరెడ్డి అనే రామభక్తుడు 1713లో నిర్మించారు. పత్తి వ్యాపారం చేసే రామిరెడ్డి ఏడాడి పొడవునా నిష్ఠ, నియమాలతో గోటితో ధాన్యం వలిచి తలంబ్రాలు తయారు చేసుకొని శ్రీరామనవమికి భద్రాచలం వెళ్ళి రాములోరి కల్యాణంలో వినియోగించి వచ్చేవారు. వృద్ధాప్యం రావడంతో ఇక నుంచి ఎలా రాగలను అని స్వామీ అని ధ్యానిస్తూ ఉండేవాడు. ఒక రోజు వ్యాపార నిమిత్తం తెలంగాణ ప్రాంతం మధిరకు వెళుతుండగా కనుమూరు గ్రామం దగ్గర పర్వతం వద్దకు వెళ్లేసరికి పొద్దుకూకింది. గాలి, వాన ప్రారంభమైంది. మహారణ్యంలో దారి కానరాక తన సహచరులతో రామిరెడ్డి అక్కడే మకాం చేశారు. శ్రీరాముని ధ్యానించుచూ రామిరెడ్డి నిద్రించగా, స్వామి స్వప్నంలో ప్రత్యక్షమై నీవు ఇక నుంచి భద్రాచలం రానవసరం లేదని, ఈ పర్వత ప్రాంతంలో పూజా విధానాలు లేకుండా ఉన్నాను.. తీసుకు వెళ్ళి ప్రతిష్ఠించి కల్యాణం జరిపించమని ఆజ్ఞాపించెను. రామిరెడ్డి ఉదయాన్నే పరిజనులతో దక్షణాభిముఖుడై పరిసరాలను పరిశీలించగా ఒక రాతిపైన తీగలచే చుట్టుకొనబడి ఉన్న బలుసు పొదలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు కన్పించాయి. దీంతోరామిరెడ్డి భక్తి పారవశ్యుడై పత్తి గోనెలలో స్వాములను భద్రపరుచుకొని ఎద్దుల బండిపై తన స్వగ్రామం నరశింహారావుపాలెం వస్తుండగా చనుబండ గ్రామం వచ్చాక ఎద్దులు కదలకుండా పడుకున్నాయి. ఎంత ప్రయత్నించినా ఎద్దులు లేవకపోవడంతో రామిరెడ్డి బృందం అక్కడే విశ్రమించారు. రామిరెడ్డికి ఆ రాత్రి స్వప్నంలో శ్రీరాముడు ప్రత్యక్షమై ఇక్కడే ఆలయం నిర్మించాలని ఆదేశించెను. అంతట రామిరెడ్డి తన శక్తినంతయు దారపోసినా ఆలయం పూర్తికాకపోవడంతో గ్రామాలకు వెళ్లి భక్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణం పూర్తిచేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇది అపరభద్రాద్రిగా పేరుగాంచి పుణ్యక్షేత్రం అయ్యింది. ఇక్కడ జరిగే శ్రీసీతారామ కల్యాణానికి చుట్టుపక్కల మండలాలు,జిల్లాల నుంచే కాకుండా సరిహద్దున తెలంగాణ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. భద్రాచలం వెళ్ళి శ్రీసీతారాముల కల్యాణం తిలకిస్తే ఎంత ముక్తి లభిస్తుందో ఇక్కడ కల్యాణం చూసినా అంతే ఫలం దక్కుతుందని భక్తులు విశ్వాసం.

వెలంపేట ఆరాధ్యదైవం కోదండరాముడు

ఆకివీడు : వెలంపేట వాసులతో పాటు చుట్టుపక్కల ప్రజలకు ఆరాధ్య దైవం కోదండ రామాలయం. ఈ ప్రాంతవాసులు ఏ పనిచేయాలన్నా ముందుగా శ్రీరాముని దర్శించుకొంటారు. 1979లో దేవాలయం నిర్మాణం చేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. దీనికి ముందు మట్టి విగ్రహాలుండేవి. వాటికే ఉత్సవాలు నిర్వహించేవారు. అక్కడే బడి కూడా ఉండడంతో చదువుకొనేవారు. అందువల్ల దీనిని గుడిబడి అనేవారు. ఈ గుడిబడిలో చదువుకున్న వారందరు నేడు మంచి స్థాయిలో ఉన్నారు. ఉగాది, శ్రీరామనవమి, వినాయకచవితి, దేవీనవరాత్రులు, సంక్రాంతికి గోదాకళ్యాణం, ముక్కోటి ఏకాదశి, ప్రతీ శనివారం ప్రత్యేక ఆలంకరణ చేస్తారు. ఉండి నియోజకవర్గంలో పోటీ చేసే ప్రజాప్రతినిధులు ముందుగా వచ్చి ఈ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయం.. ఉత్సవమూర్తులు





జనార్దనవరంలో బంగ్లాదేశ్ బృందంతో రైతులు అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై బంగ్లాదేశ్ బృందం ప్రశంస

చాట్రాయి, జనవరి 20: రైతు సాధికార సంస్థ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని బంగ్లాదేశ్ బృందం సభ్యులు అకోండ్ మహ్మద్, తాఫిక్ హసన్, అఫ్రినా సుల్తానా తదితరులు ప్రశంసించారు. జనార్దనవరంలో శనివారం బంగ్లాదేశ్ బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడింది. ప్రకృతి వ్యవసాయ హెల్త్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి పొలంలో ఉన్న న్యూట్రీ గార్డెన్‌ను సందర్శించారు. ఇందులో పండే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సొంత అవసరాలకు పోను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న విధానాన్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి చంద్రకాంతమ్మ అనే మహిళ పెరటితోటను పరిశీలించగా ఇంటి అవసరాలకు సరిపడ కూరగాయలు, ఆకుకూరలను ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వాడకుండా పండించి ఆరోగ్యంగా జీవిస్తున్నట్లు ఆమె వివరించింది. మిచౌంగ్ తుఫాను తాకిడిని కూడా తట్టుకొని ప్రకృతి వ్యవసాయ పంటలు నిలబడ్డాయని ప్రాజెక్టు జిల్లా మేనేజర్ తాతారావు, వ్యవసాయాధికారి శివశంకర్ బృందానికి వివరించారు. తమ దేశంలో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అమలు చేస్తామని బృందం తెలిపింది. మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరరావు, రైతు సాధికార సంస్థ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీచేసిన న్యాయాధికారి

కైకలూరు, జనవరి 20: ఖైదీలకు నిర్దేశిత మెనూ ప్రకారం భోజనం అందించాలని కైకలూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వీవీఎన్ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం కైకలూరు సబ్ జైలును ఆమె ఆకస్మిక తనిఖీ చేసి ఖైదీలకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలు ఏయే కేసుల్లో జైలుకు వచ్చింది తెలుసుకుని అవసరమైన వారికి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం సత్యనారాయణ, న్యాయవాది డి శివప్రసాద్, జైలు అధికారి పి. అప్పారావు, ఏఎస్సై మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

3న న్యాయ సేవల శిబిరం



మాట్లాడుతున్న న్యాయాధికారి నాగశైలజ

నూజివీడు, జనవరి 20: నూతన విధానంలో న్యాయ సేవల శిబిరాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ. నాగశైలజ కోరారు. నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో శనివారం పలు శాఖల అధికారులతో ఫిబ్రవరి 3న శిబిరం నిర్వహణకు సంబంధించి సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ స్కీం, మాదక ద్రవ్యాల వినియోగం-దుష్ఫలితాలు, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన అంశాలపై న్యాయ సేవల శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతిశాఖ అధికారులు స్టాల్స్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించటమే కాకుండా సమస్యలపై పరిష్కారాలకు కృషి చేయాలని ఆదేశించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

ముదినేపల్లి రూరల్, జనవరి 20: ముదినేపల్లి మండలం సింగరాయ పాలెం, చేవూరుపాలెం సెంటర్లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం జరిగింది. 25 మంది దంపతులు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో సంధ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, జనవరి 20: నూజివీడు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని పెద్ద గాంధీబొమ్మ, చిన్న గాంధీబొమ్మ సెంటర్, తిరువూరు రోడ్డు, ఎంప్లాయిస్ కాలనీ, బ్యాంక్ స్ట్రీట్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, జంక్షన్ రోడ్డు, అమ్మవారి తోట, ఆర్ఆర్ పేట, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతోందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

30న రైతు సంఘం నిరసన



నూజివీడు, జనవరి 20: చింతలపూడి ఎత్తిపోతల పథకం వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టాలని నూజివీడు రైతు సంఘం తీర్మానించింది. శనివారం నూజివీడు నియోజకవర్గ రైతుసంఘ కార్యవర్గ సమావేశం ఏలూరు జిల్లా సంఘ అధ్యక్షుడు రాయంకుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనంపూర్తిగా నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను వైసీపీ నిర్లక్ష్యం చేసిందని, ఈ పథకం పూర్తయితే మెట్టప్రాంతమైన నూజివీడులో లక్షల ఎకరాల్లో సాగునీటి అవసరాలు తీరతాయన్నారు. ప్రభుత్వం పై వత్తిడి తెచ్చేందుకు రైతుసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రైతు నాయకులు చలసాని వెంకట రామారావు, మడుపల్లి నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

31న బలివే ఆలయంలో వేలం

ముసునూరు, జనవరి 20: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించిన పనుల నిమిత్తం ఈ నెల 31న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వేలం పాటలో ఇప్పటివరకు దరఖాస్తులతో పాటు డిపాజిట్ చేసిన వారు పాల్గొనాలని కోరారు. ఇంకా టెండర్లు దాఖలు చేయాలనుకునే వారు సంబంధిత ఫారాలను పూర్తిచేసి 31వ తేదీ ఉదయం 11 గంటల్లోపు దేవస్థానం వద్దగల టెండర్ బాక్సులో వేయాలని కోరారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు



సల్మాన్

ముదినేపల్లి, జనవరి 20 : ముదినేపల్లికి చెందిన అబ్దుల్ సలామ్ కుమారుడు సల్మాన్ ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజూ లాగే శుక్రవారం ఉదయం స్కూలుకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. అయితే మధ్యాహ్నం స్కూలుకు రాలేదని స్కూలు యాజమాన్యం సల్మాన్ తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో సలాం కుమారుడి కోసం వెదికినా ఆచూకీ తెలియ లేదు. దీంతో విద్యార్థి తండ్రి శనివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాస్టర్, సంఘస్థుల వివాదం

ఆగిరిపల్లి, జనవరి 20: ఆగిరిపల్లి మండలం నెక్కలంగొల్లగూడెం ఐసీఎం చర్చి పాస్టర్, సంఘస్థుల వివాదం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పాస్టర్ పి.గన్నయ్య అలియాస్ పాల్ చర్చికి వచ్చే కుటుంబీకుల మధ్య వివాదాలు సృష్టించడంతో పాటు చర్చిలో దైవసేవకు బదులు రాజకీయాలు నడపుతున్నారని సంఘస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేమంటే తమపై కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతున్నాడని ఆగిరిపల్లి పోలీసులను సంఘస్థులు ఆశ్రయించారు. చర్చి బైలాలో ఉన్న విధంగా, నడుచుకోవాలని వివాదం సివిల్‌కు చెందింది కావడంతో సదరు విషయం కోర్టులో తేల్చుకోవాలంటూ ఆగిరిపల్లి ఎస్సై చిట్టిబాబు ఇరువర్గాలకు సూచించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



ముసునూరు, జనవరి 20: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు ఉప్పలపాటి గణేష్ అన్నారు. శనివారం గోపవరం బీసీ కాలనీలో టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి రాగానే అమలుచేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశాడన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలన్నారు. టీడీపీ నాయకులు వడ్లపట్ల మురళీమోహన్, చిలకంటి శేషు, కర్రా ఏసుపాదం, సాయిల అనిల్, కుప్పాల శివ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి కేంద్రం భరోసా



నూజివీడు టౌన్, జనవరి 20: ఉపాధి పథకం ద్వారా ప్రతి ఒక్కరి ఉపాధికి కేంద్రం ప్రభుత్వం భరోసా ఇస్తోందని, నూజివీడు ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో సర్పంచ్ ముసునూరి లక్ష్మీ కాంతమ్మ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమాను కేంద్రం అందిస్తోందన్నారు. ఇదేకాక ప్రతి ఏటా రైతులకు రూ.6 వేలు పీఎం కిసాన్ ద్వారా అందించడంతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలుపరుస్తోందన్నారు. బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు జీవిఎస్‌కే అప్పా రావు, నాయకుడు నెక్కలపు కృష్ణారావు, ఈవోపీఆర్డి సరస్వతి, వ్యవసాయాధికారిణి చాముండేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండవల్లి ఎంపీడీవో వెంకటరమణ కోరారు. మండలంలోని గన్నవరం, మోకాస కలవపూడి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. గన్నవరం సర్పంచ్ గుడివాడ తంబిస్వామి, అధికారులు పాల్గొన్నారు. రోగులకు మందులను పంపిణీ చేశారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు



స్థల దాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ముసునూరు, జనవరి 20: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నూతన భవనాల ప్రారంభోత్సవం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను ఎమ్మెల్యే, ఎంపీ నిర్వహించారు. కాట్రేనిపాడులో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించగా మంచినీటి ట్యాంక్ నిర్మాణం, ఇంటింటి కుళాయి పనులకు ఎంపీ శ్రీధర్ శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సచివాలయ నిర్మాణానికి 12 సెంట్లు స్థలాన్ని వితరణగా ఇచ్చిన దాతలు కంబాల రాఘవులు, గండిపూడి చిట్టియ్య కుటుంబీకులను సన్మానించారు. అలాగే యల్లాపురం, లోపూడిలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. సర్పంచ్ గద్దల సుహాసిని, కంచర్ల వాణి, ఎంపీపీ కొండా దుర్గాభవానీ, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



కలిదిండిలో అంగన్‌వాడీల రాస్తారోకో



ముదినేపల్లిలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు



చాట్రాయి సెంటర్‌లో అంగన్వాడీల మానవహారం

కదం తొక్కిన అంగన్వాడీలు

- రాస్తారోకో.. మానవహారాలతో నిరసన
- డిమాండ్లు పరిష్కరించకుంటే సత్తా చూపుతామని హెచ్చరిక

కైకలూరు, జనవరి 20: అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం నిర్బంధ చర్యలు చేపట్టడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరులో అంగన్వాడీలు 165వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిని దిగ్బంధించి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షను కొనసాగించారు. ఉద్యమాన్ని ప్రారంభించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా 40 అంకె నమూనాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్. మీనాకుమారి, విజిత, రమణ, ఝాన్సీ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: వేతనాలను పెంచాలని కోరుతూ శనివారం కలిదిండిలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. అంగన్‌వాడీ నేతలు అబిదా బేగం, రమాదేవి, పుష్ప, సునీత, వసంత కుమారి, సీపీఎం నేతలు మహంకాళిరావు పాల్గొన్నారు.

మండవల్లి: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని మండవల్లి మండల అంగన్వాడీ సంఘ నాయకులు హెచ్చరించారు. నిరసనలో భాగంగా శనివారం మండవల్లి ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండవల్లి సెంటర్లో మానవహారం నిర్మించారు. సంఘ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ముదినేపల్లిలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. యూనియన్ నాయకులు సొంగా మణి, అరుణ కుమారి, బండి పద్మ, రిబ్ పా నాయకత్వంలో మండలంలోని 90 మంది అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

నూజివీడు టౌన్: డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె బాటపట్టిన అంగన్‌వాడీలు నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీసవేతనంతో పాటు వారికి సంక్షేమ పథకాలను అమలుచేయాలన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, శ్యామల, ఝాన్సీ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, సీఐటీయూ నాయకులు జయలక్ష్మి, గోవింద్, రజినీ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ తీరు దారుణమని అంగన్వాడీ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి అన్నారు. ముసునూరులో 40వ రోజు సమ్మెలో ప్రధాన కూడలిలో మానవహారంతో నిరసన తెలిపి నినాదాలు చేశారు. హామీలను తుంగలో తొక్కిన సీఎం జగన్ ఎస్మా చట్టాన్ని తీసుకువచ్చి అంగన్‌వాడీలను తొలగించాలని దుశ్చర్యకు పాల్పడటం ఈ ప్రభుత్వ అసమర్థపాలనకు నిదర్శనమని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు కె.విద్యావతి, మేరీ సులోచన, శ్యామల, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చాట్రాయి సెంటర్‌లో శనివారం అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద 40వ రోజు దీక్ష కొనసాగించారు. కనీస వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి అన్ని గ్రామాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: 40 రోజులుగా సమ్మెచేస్తున్నా ఈ చేతకాని ప్రభుత్వంలో చలనం లేదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దకొరాయి సెంటర్లో మానవహారం, ధర్నా చేశారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఎం నాయకుడు సత్తు కోటేశ్వరరావు అన్నారు. సీఐటీయూ కార్యదర్శి రాజులపాటి చంటి, గరిసేపల్లి రాజు పాల్గొన్నారు.